"టాక్సీ!" మరీ నెమ్మదిగా పిలిచానేమో మూడు సార్లు పిలిస్తేనేకాని టాక్సీ దగ్గిరికి రాలేదు.

డ్రైవరు తలుపు తెరిచి పట్టుకొన్నాడు. ఎలాగో లోపికి వెళ్లి కూర్చున్నాను.

"ఎక్కడికి వెళ్లాలండీ, అమ్మగారూ?"

ఏం చెప్పాలో తోచలేదు. గమ్యం లేదు. గమనం కావాలి. ఎలా?

రెండు క్షణాలు ఆగి, "ఏదైనా బార్‌కి" అన్నాను. టాక్సీ బయలుదేరింది. మనస్సు పరిపరి విధాల పోతూంది. ఈ పాతికేళ్ల జీవితంలో ఎన్నడూ లేనంత చికాకు, విసుగు, నైరాశ్యం. టాక్సీ ముందుకు పరిగెడుతూంటే ఆలోచనలు మాత్రం ముందుకే వెనక్కీ గంతులు వేస్తున్నాయి. ఏమిటి నేను చేయ బోయే పని? తప్పు కాదూ? మద్యపానం మగవాడికి అలవాటయితేనే పాపం కదా మరి, నేను స్త్రీనయి ఉండీ... అదీ ఒక గౌరవ కుటుంబానికి చెందినదానినయి ఉండీ .... ఛీ...ఛీ... అని మనస్సు కొంతసేపు ఆక్రోశించింది కాని మరుక్షణంలోనే ఎక్కడలేని మొండి తనము, తెగువ వచ్చేశాయి! ఏం, తాగితే తప్పేం ఉంది? అయినా ఇప్పుడు కావలిసింది మనశ్శాంతి కాని నీతి పాఠాలు కావు! దీని వెనక పెద్ద కారణం ఉంది. అందు కనే నాకు తాగాలని ఉంది.

టాక్సీ ఒక్క కుదుపుతో ఆగింది. భారంగా టాక్సీనుండి దిగి డ్రైవరుకి డబ్బు ఇచ్చేసి ఎదురుగా చూశాను. లైట్లతో 'బ్లూ స్టార్' అని ఇంగ్లీషు అక్షరాలు ఆకాశంలో వెలుగుతున్న నీలంరంగు నక్షత్రాల్లాగే మెరుస్తున్నాయి. అలా బార్ ముందు నిలబడి నందుకే పూర్తిగా కుంచించుకొనిపోయి, చీర నిండుగా కప్పుకొన్నాను. కొంతసేపు తటపటాయించి నెమ్మదిగా అడుగులు వేస్తూ లోనికి ప్రవేశించాను.

కళ్ళు ఒక్కసారిగా చెదిరిపోయాయి! ఎన్నో రకాల మనుషులు ఆడ మగ అనే విచక్షణ లేకుండా మద్యం సేవించి మత్తుగా చిత్తం వచ్చినట్లు నవ్వుతూ, పేలుతూ కనిపించారు. ఇదే దృశ్యాన్ని నే నింతకు ముందు చూసి ఉంటే వీళ్ల నెంతగానో అసహ్యించుకొని ఉండేదాన్ని. కాని, ఇప్పటి నా పరిస్థితిని బట్టి వీళ్ళూ ఏదో బలీయమైన కారణం లేనిదే ఈ కార్యం చేయరనిపించింది.

ఫామిలీ పోర్షన్‌కి పోయి ఒక్కదాన్నే కూర్చున్నాను. మనస్సంతా భారంగా ఉంది. 'నేను చేసే పని ఎంత వరకు సమంజసం?' అనే మీమాంసలో పడి కొట్టు కుంటూండగా వెయిటర్ వచ్చాడు.

"ఎస్, మేడమ్. వాట్ డు యు వాంట్?"

డ్రింక్స్‌లో చాలా రకాలు ఉంటాయని విన్నాను గాని వాటి పేర్లు తెలియవు. అందుకని, "ఏదీ స్ట్రాంగ్ డ్రింక్" అన్నాను.

రెండు నిమిషాల్లో ఓ పెద్ద సీసా, దానితోబాటు గ్లాసు బల్లమీద అమర్చబడ్డాయి. 'ఎర్రని ద్రవం' సీసానుంచి గ్లాసులో పోస్తూంటే చేతులు వణికాయి. అబ్బ! ఎంత ఎర్రగా ఉందీ ద్రవం రక్తంలా! ఎవరో హృదయాన్ని పిండి ఆ రక్తాన్ని సీసాలో బిగించారు కాబోలు!

గ్లాసు నిండింది. నెమ్మదిగా దాన్ని పైకెత్తి పెద వులకు ఆనించబోయాను. నరేందర్ నవ్వుతున్న ప్రతి బింబం కనిపించింది ఆ డ్రింక్‌లో! చటుక్కున బల్ల మీద వదిలేశాను గ్లాసు!

"నరేందర్, నవ్వకు. నవ్వకు. ఎందుకు నీ కీ నవ్వు? నా బాధలే నీ బాధ అన్నావే...ఇందుకేనా నా బాధ చూసి నవ్వుతున్నావ్?" ఇలా పిచ్చి పిచ్చిగా నాలో నేనే మాట్లాడుకుంటున్నాను.

ఇంతలో ఎవరి కోరిక ప్రకారమో ననుకుంటా రేడియోగ్రామ్ నుండి రికార్డు మొదలయింది: "ఏక్ తూ న మిలా, సారీ దునియా మిలీభీ తో క్యా?"

ప్చ్! ఎంత హృదయవిదారకంగా ఉందీ పాట! నిజం, నరేందర్, నువ్వు నాకు లభించకపోయిన తరవాత ఈ ప్రపంచమంతా దొరికినా ఏం లాభం?

ఆలోచనలు వెనక్కి మళ్లాయి.

నాంపల్లి స్టేషన్ చాలా హడావిడిగా ఉంది. అప్పుడే జి. టి. ప్లాట్‌ఫారంమీద నిలిచింది. రిజర్వేషన్ లేని జనమంతా తొక్కుకుంటూ బండి ఎక్కడానికి నానా అవస్థా పడుతున్నారు.

నా కెలాగూ ఢిల్లీ కంపార్టుమెంటులో రిజర్వేషన్ ఉంది కనక తాపీగా వెళ్లి ఎక్కాను. సీటు నంబరు ఇరవై ఒకటి చూసుకొని, సామాను సర్దేసుకొని, బెర్తుపైన దుప్పటి అదీ పరుచుకొని సీటులో కూర్చో బోతూండగా ట్రెయిన్ నాంపల్లిని వదిలివేయడానికి కదలబోతూంది.

ఇంతలో...



"మేడమ్, ప్లీజ్!" ఒక పురుషకంఠం వినబడ డంతో కిటికీవైపు చూశాను. ప్లాట్‌ఫారంమీద ఆరడుగుల వ్యక్తి...బండితోపాటు పరిగెడుతున్నాడు. సంగతి అర్థం చేసుకోడానికి ప్రయత్నించే లోపునే లెదర్ బాగ్, అటాచీ — ఇలా ఓ అరడజను సామాన్లు కిటికీ గుండా నా చేతిలోకి రావడం, నేను అందుకొని లోపల పెట్టడం జరిగిపోయాయి.

బండి పూర్తి స్పీడు అందుకొనే లోపున ఆ వ్యక్తి లోనికి వచ్చేసి నాకు ఎదురుగా ఉన్న సీట్లో కూర్చున్నాడు.

"సారీ, మీకు చాలా ట్రబుల్ ఇచ్చాను."

"ఓ. నెవర్ మైండ్. దానికేం లెండి" అన్నాను మర్యాదాసూచకంగా. కిటికీ దగ్గిర నా సీటు ఉండడంవల్ల ఈ మహానుభావుడికి నా సహాయమే కావలిసివచ్చిందను కొని, దానితో పోయిందేమి ఉందిలే అనుకున్నాను.

"థాంక్యూ వెరీ మచ్, మిస్... మే ఐ నో యువర్ నేమ్ ప్లీజ్?"

"మిస్ సుమతి." ఏమిటో ఈ మనిషి చొరవ అను కుంటూనే ఉన్నా అతని వాక్ప్రవాహానికి అడ్డువేయ లేకపోతున్నాను. అతని ప్రవర్తన అసహ్యంగా లేదు. ఎంతో నాజూకయిన వ్యక్తిలా ఉన్నాడు. కనకనే జవాబివ్వకుండా ఉండలేకపోయాను. అలా కాకపోతే నేనే అసభ్యంగా ప్రవర్తించినట్లు ఉంటుందని భయం వేసింది.

కనకనే మర్యాదకు సూచనగా, "మరి, మీ పేరు?" అని అడిగాను.

"నరేందర్. మీరూ ఢిల్లీకేనా ప్రయాణం?"

"అవునండీ. మీ రక్కడేం చేస్తున్నారు?" తిరిగి ప్రశ్నించాను.

"ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్‌లో రీసెర్చి ఆఫీసర్నండీ. మరి, మీరూ ఏదైనా జాబ్ చేస్తున్నారా?"

"జాబ్ ఏం లేదండీ. అగ్రికల్చరల్ ప్రాబ్లమ్స్‌మీద రీసెర్చి చేస్తున్నాను."

అంతలో సికిందరాబాదు స్టేషన్ వచ్చింది. బండి ఆగిన అయిదు నిమిషాలకు లత పరిగెత్తుకుంటూ మా కంపార్టుమెంటు దగ్గిరికి వచ్చేసింది.

"ఏమిటోయ్, లతా, స్టేషన్‌లో కలిసి మాట్లాడాలి అని చెప్పినదానివి ఇంత ఆలస్యంగా వస్తావా?" అన్నాను కోపంగా.

"సరిలే, తల్లీ. ఈ ప్లాట్‌ఫారమ్ మీద వెతుక్కోడానికి ఎంత టైము పడుతుందో అర్థం కానిదానివి ఆ రీసెర్చి ఎలా వెలగబెడదా మనుకుంటున్నావ్?" అంది నవ్వుతూ.

నాకూ నవ్వు వచ్చింది. నాతోబాటు నరేందర్ కూడా నవ్వాడు. లత ఆశ్చర్యపోతూ నవ్వుతున్న నరేందర్ వైపు చూపిస్తూ అతనికి తెలియకుండా 'ఎవరు?' అన్నట్లు నా వైపు సైగ చేసింది.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది వాళ్ళను పరిచయం చెయ్యాలని.

"ఈమె నా ఫ్రెండ్ లత. ఈయన మిస్టర్ నరేందర్. ఢిల్లీలో ఉద్యోగం. ఇప్పుడే పరిచయ మయ్యారు."

బండి నెమ్మదిగా బయలుదేరింది.

"గుడ్ లక్, హాపీ జర్నీ." చిలిపిగా మా ఇద్దరివైపు చూస్తూ చేతులు ఊపింది లత.

నిజంగా అది నా జీవితంలో హాపీ జర్నీ అయింది. అత్యవసరమైతేనేకాని మాట్లాడే స్వభావం లేని నేను నరేందర్ అతిచనువు ముందు అపజయం అంగీకరించవలసి వచ్చింది.

ఢిల్లీలో దిగిపోయాం. అంతటితో మా పరిచయం కేవలం రైలు పరిచయంలో ఆగిపోతే బాగుండేది. కాని అలా జరగలేదు.

నా రీసెర్చి పనిమీద రెండు నెలలు ఢిల్లీలోనే ఉండవలసి వచ్చింది. ఎవరూ తెలియని స్థలంలో చాలా ఇబ్బంది పడవలసి వచ్చేది. కాని, నరేందర్ సహాయం వల్ల వచ్చినపని అతి సులువుగా ముగించుకోగలిగాను.

ఈ రీసెర్చి వర్క్ వల్ల ఇద్దరమూ కలిసి వెళ్ళ వలసివచ్చేది. దానివల్ల నరేందర్ ఇంకా సన్నిహితు డయిపోయాడు. ఆ స్థలం వదలకముందు ముఖ్య మైన స్థలాలన్నీ చూడాలనిపించింది. అదే విషయం నరేందర్ అనగానే సంతోషంతో ఒప్పుకొన్నాను.

ఆ సుందరమైన దృశ్యాలు చూస్తూ తెగనవ్వించే నరేందర్ పక్కన నడుస్తూంటే, కలకాలం అలానే నడుస్తూ ఉండాలనే వింత కోరిక కలిగేది. వింత కోరికలు...విచిత్రానుభవాలు! ఇంత సన్నిహితంగా మెలిగినా ఏనాడూ హద్దుమీరి ప్రవర్తించలేదు నరేందర్. అందుకనే అతడంటే ప్రేమాభిమానాలు ఇనుమడించాయి.

ఏమయినా ఆ రెండు నెలలు గడవడంతో ఒకరిని విడిచి ఒకరు ఉండలేమన్న నగ్నసత్యాన్ని గుర్తించాము. ఎన్నో ప్రమాణాలు...ఎన్నో వాగ్దానాలు.

తిరిగి హైదరాబాదుకు బయలుదేరాను. నరేందర్ వీడ్కోలు ఇవ్వడానికి స్టేషనుకు వచ్చాడు. 'ఏమిటో ఇదే ఆఖరి వీడ్కోలు కాబోలు!' అని అని పించినా అలా ఎప్పటికీ కాదని తిరిగి అంత బాధలోను నవ్వుకున్నాను సంతృప్తిగా.

ట్రెయిన్ కదలడానికి సిద్ధంగా ఉంది. కళ్ళలో నీరు గిరుక్కున తిరిగింది. ఆ కన్నీటి పొరలనుండి నరేందర్ మసకగా కనబడుతున్నాడు. అతని కళ్ళ నుండీ రెండు కన్నీటి బొట్లు జారబోతూంటే వెంటనే తుడిచేసుకున్నాడు రుమాలుతో. నేను కూడా దుఃఖాన్ని ఆపుకోడానికి సర్వవిధాలా ప్రయత్నం చేస్తున్నాను.

"సుమా! వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తావు కదూ?"

"ఊఁ."

"ఇంకో నెలకు సెలవు లిస్తారు. వెంటనే అక్కడికి వచ్చేస్తాను. నీ బాధలు నా బాధలు కావూ? ఊఁ.... సంతోషంగా ఉండాలి, మరి." నవ్వడానికి ప్రయత్నిస్తూ నన్ను ఓదార్చాలని తంటాలు పడ్డాడు నరేందర్.

బండి బయలుదేరింది నరేందర్‌ను నాకు దూరం చేయడానికి.

ఆ నెల రోజులు ఎంత దుర్భరంగా గడిచాయని! రెండు నెలల్రకితం ముక్కూ మొహం తెలియని వ్యక్తి ఇప్పు డింతగా సన్నిహితుడయిపోయి, అతను లేనిదే జీవితం లేదనుకోవడం ఎంత వింత! ఉత్తరాల ద్వారా ఉపశాంతి.

ఈ సంగతి ఒక్క లతకు మినహాయించి మరో ప్రాణికి తెలియదు. లతకు ఈ విషయం చెప్పి నప్పుడు తెగ ఎగతాళి చేసింది ఇలా: "అయితే అమ్మాయిగారు రీసెర్చికి నమస్కారం కొడతారా? ఎప్పుడు మా బావగారి రాక? చూడాలని తహతహగా ఉంది. ఆ రోజు స్టేషన్‌లో సరిగ్గా చూడలేదు. అయినా ఎవరు కలగన్నారు, తల్లీ, నీ వీ ఘనకార్యం చేస్తావని?"

నేనుమాత్రం కలలోనైనా ఊహించానా ఇలా ఓ వ్యక్తిని ప్రేమిస్తానని. మొదటినుంచి అబ్బాయి లంటేనే దురభిప్రాయం. సంకుచితత్వం, స్వార్థం కలిపితేనే వాళ్ళ తయారవుతారనేది నా నమ్మకం. ద్వేషపూరితమైన వాతావరణంలో ప్రేమ నిలవదు. అలాగే స్వార్థపూరితమైన ప్రపంచంలో నిస్స్వార్థం మనలేదు. పుట్టిన దాది ఉన్నది తనదని రూఢి చేసుకొనడానికి, ఆనందం పొందడానికి మనిషి సర్వశక్తులూ వినియోగించి యత్నిస్తున్నాడు. అలాంటప్పుడు తనది అనుకొన్నదానిని విడిచి దుఃఖం కొని తెచ్చుకొనడానికి అంగీకరించేవారు ఎవరు?

# నాకు తాగాలని ఉంది

## ఎన్. ఎస్. ఎమ్. సుమన్

కాని ఆ నమ్మకాన్ని వమ్ము చేసినవాడు నరేందర్. అందుకనే అతన్ని...

ఆత్రతతో ఎదురు చూసిన ఆ రోజు రానే వచ్చింది. స్టేషనుకు వెళ్ళాను. నరేందర్ బండినుండి దిగబోతూండగా దగ్గిరికి వెళ్ళబోయాను. అంతలోనే "వచ్చావా, మామయ్యా" అంటూ ఓ ఇరవై ఏళ్ళ అమ్మాయి అతన్ని సమీపించింది.

"నీవొక్కదానివే వచ్చావా, శోభా?" నరేందర్ ప్రశ్న.

"ఊఁ." గోముగా ఆ అమ్మాయి సమాధానం.

అంతవరకూ నన్ను గమనించనే లేదు నరేందర్. ఇటు తిరిగి నన్ను చూడగానే, "అరే, సుమతీ! మీరూ వచ్చారా? ఇంత సేపు కనపడలేదేం?" అన్నాడు.

చిరునవ్వు నవ్వి, "మీ హడావిడిలో మీరు ఉన్నారు! సరేగాని ప్రయాణం కులాసాగానే జరిగింది కదూ?" అన్నాను.

"అబ్బే, పోయినసారిలా సరదాగా ఎలా ఉంటుంది?" అని భావగర్భితంగా నావైపు చూశాడు.

'ఓహో. ఆ ప్రయాణం, ఇద్దరమూ...' పైకి అనలేక నా మనస్సులోనే తలుచుకున్నాను మా మొదటి కలయిక.

ఆ అమ్మాయి మాత్రం ఇబ్బందిగా చూస్తూంది.

ఇంతలో జ్ఞాపకం వచ్చినవాడిలా, "ఈమె నా స్నేహి తురాలు సుమతి. రీసెర్చి చేస్తున్నారు. ఇక ఈమె మా పెద్దక్కయ్య కూతురు శోభ. బి. ఎస్‌సి. చదువు తూంది" అని మా ఇద్దరిని పరిచయం చేశాడు.

చిరునవ్వులతో చేతులు జోడించుకున్నా, మా ఇద్ద రిలో ఏవేవో భావాలు దొర్లుతున్నాయనేది ఒకరిని చూసి ఒకరం అర్థం చేసుకోగలిగాము. నాకంటే చిన్నది, అనుభవం తక్కువ కలది కావడంవల్ల శోభ తన అసహనాన్ని వ్యక్తం చేస్తూ అక్కడినుండి వెళ్ళిపోవాలని ప్రయత్నం చేస్తూంది. నేనుమాత్రం నిబ్బరంగా ఉండడానికి ప్రయత్నం చేశాను. నరేందర్ మాత్రం ఇదేమీ పట్టించుకున్నట్లు లేదు.

స్టేషన్ బయటికి ముగ్గురమూ వచ్చేశాము.

టాక్సీ రావడంతో శోభ కోపంగా ముందుపోయి కూర్చుంది. నన్ను కూడా ఎక్కమన్నాడు నరేందర్. కాని, నేనే వద్దన్నాను. పరిస్థితి గ్రాహ్యమయింది కాబోలు.

"సరే, సుమతీ! రేపు సాయంత్రం నాలుగు గంట లకు [illegible] హోటల్‌లో కలుద్దాము" అనేసి టాక్సీ ఎక్కాడు. టాక్సీ కదిలింది.

నేను వేరే టాక్సీ తీసుకున్నాను. మనస్సంతా భారంగా ఉంది. ఎన్ని కలలు కన్నాను ఈ రోజుకోసం! ఎన్నో కబుర్లు చెప్పాలి, నరేందర్‌ని నవ్వించాలి, ఆ నవ్వు లన్నీ భద్రంగా ఏరి దాచుకోవాలి—ఇలా ఇలా ఆలోచనలతో గడిచాయి ఇన్ని రోజులు. కాని, ఇప్పుడు రెండే రెండు మాటలతో తృప్తి పడవలసి వచ్చింది. ఇంతకూ ఆ శోభ సంగతి నాకు ఎందుకు చెప్పలేదు? అక్క కూతుర్ని గురించి చెబితే నష్టమేమిటి? లేక...ఏమో!

రాత్రి అంతా ఇవే ఆలోచనలతో కాలం గడిచి పోయింది. భారంగా తెల్లవారింది. అమ్మకు నా అశాంతి తెలియకూడదని మామూలుగానే స్నానం అదీ చేసి కాఫీ తాగి నా గదిలో కూర్చున్నాను. ప్రతిరోజులా రీసెర్చి వర్క్ మొదలుపెట్టాలని సర్వవిధాల ప్రయ త్నించి ఓడిపోయాను. తలుపులన్నీ బిగించి పెట్టె అడుగునుండి నరేందర్ ఫోటో బయటికి తీశాను. అదే నవ్వు...నా కెదురుగా నరేందర్ నిలిచినట్లయింది. 'నరేందర్, నువ్వు లేకపోతే బతకలేను, నరేందర్...'

తలుపుమీద ఎవరో టక్ టక్‌మని కొడుతున్నారు.

ఫోటో గభాలున పెట్టె అడుగున పడేసి తలుపు తీశాను.

"ఎవరో అబ్బాయి నీకోసం వచ్చాడే!" అమ్మ అంటూండగానే బయటికి దారి తీశాను.

అపరిచితుడు, పదిహేను ఏళ్ళ అబ్బాయి కూర్చుని ఉన్నాడు.

"మా అక్కయ్య మీ కీ ఉత్తరం ఇవ్వమన్నదండి" అనేసి ఓ ఉత్తరం నా చేతిలో పెట్టి నే నేదో అడగబోయే లోపునే సైకిల్‌మీద వెళ్ళిపోయాడు.

"ఎవరే, ఆ అబ్బాయి?" అమ్మ ప్రశ్న.

ఏమనాలో తెలియక, "నా స్నేహితురాలి తమ్ముడు" అనేశాను.

ఆ ఉత్తరం చదవాలని ఆత్రత. ఎవరినుండి?

నా గదిలోకి వెళుతూనే కవరు చింపాను. చక్కని దస్తూరిలో ఉంది ఆ ఉత్తరం.

"ప్రియమైన సుమతిగారికి,

మీరు ఈ ఉత్తరం చూసి ఆశ్చర్యపోవచ్చు. ఎంతో అవసరం ఉండి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను. మీరు మా మామయ్యకు వ్రాసిన ఉత్తరాలు చూశాను. నా భయం నిజమయింది. మామయ్యను ఈ విషయం అడిగాను. చేసింది తప్పయినా, నా జీవితానికి సంబం ధించిన సమస్య కనక మీ ఉత్తరాలు దొంగతనంగా చూసిన విషయం నా కంత తప్పుగా తోచలేదు. అయినా అసభ్యమైన పని కనక నన్ను క్షమించగలరు. ముఖ్య మైన సంగతులు మీతో మాట్లాడాలి. ఈ రోజు ఉదయం పది గంటలకు పబ్లిక్ గార్డెన్స్‌కి శ్రమ అనుకోకుండా రండి! ప్లీజ్! మీకొరకు గేటు దగ్గిర ఎదురు చూస్తూంటాను. ఈ సంగతి ఎవరికీ తెలియ కూడదని మా తమ్ముణ్ణి రహస్యంగా మీ వద్దకు పంపాను. తప్పక వస్తారు కదూ?

ఇట్లు
మీ కొరకు ఎదురుచూచే
శోభ."

నా ఊహ నిజమయింది. ఇక ముందు ఏమి చెయ్యాలో తోచలేదు. యాంత్రికంగా తయారయి పది గంట



# నాకు తాగాలని ఉంది

లకు పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్లాను. అప్పటికే శోభ ఎదురు చూస్తూ ఉంది. ఆమె ముఖమంతా కళావిహీనమై ఉంది. బాగా ఏడ్చి ఉంటుందనుకుంటాను.

"వచ్చారా? వస్తారో రారోనని భయపడుతున్నాను."

"నేనంత కఠినహృదయురాలిని కాను" అన్నాను నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఒక చెట్టు నీడలో కూర్చున్నాము.

సంభాషణ సాగించడానికి ఎవరికీ మాటలు దొరకడం లేదు.

చివరికి శోభే మొదలుపెట్టింది.

"మామయ్య నాతో పెద్ద వాదం పెట్టుకున్నాడండీ!"

"ఎందుకూ?" అన్నాను వాడిగా.

కొద్దిగా సిగ్గుపడుతూ, తప్పనిసరి అన్నట్లుగా అంది: "చూడండీ, చిన్నప్పటినుండి నన్ను మామయ్యకివ్వాలనేది మా పెద్దల నిశ్చయమే కాక మా ఇద్దరి హృదయాల్లో కూడా అదే భావం ఉంది. కాని మూడు నెలలుగా మామయ్య ఉత్తరాలు వ్రాయకపోవడం నా కెందుకో బాధ కలిగించింది. ఇంతకు ముందు ప్రతివారం ఉత్తరం వ్రాసేవారు. ఈసారి మాత్రం వచ్చేముందు ఒక్క ఉత్తరం — వస్తున్నట్లుగా మాత్రం తెలుపుతూ — వ్రాశారు. అందుకనే అనవ్యమని తెలిసినా మామయ్య సూట్‌కేస్ వెతికితే మీ ఉత్తరాలు కనిపించాయి. నా అనుమానం కాస్తా నిజమయింది. ఏం చేయాలో తోచలేదు కనక మీ సహాయమే తీసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఏమయినా చిన్నప్పటినుండి ఆరాధిస్తున్న మామయ్య — నిజం సుమతిగారూ, మామయ్య లేకపోతే ఇక బతకలేను. మీరే సాయం చేయాలి!" కళ్లలో నీరు తిరుగుతూండగా శోభ ఇక మాట్లాడలేకపోయింది.

నాకు పరిస్థితులు పూర్తిగా అర్థమయ్యాయి. ఇక ఎక్కువ ఆలోచించలేకపోయాను. నామీద నాకే జాలి! తోటి స్త్రీ అయిన శోభమీద జాలి.

"నీకే సహాయం కావాలన్నా తప్పక చేస్తాను, చెల్లీ." అప్రయత్నంగా అన్నాను. శోభ నన్ను గట్టిగా చుట్టేసుకొంది. "నిజమా, అక్కయ్యా!" అనిమాత్రం అనగలిగింది ఆ సంతోషంలో.

ఇక నరేందర్‌ను కలవకూడదు. శోభకోసం మహా త్యాగం చేసేస్తున్నానని కాదు. నా అంచనాలన్నీ తప్పు అని ఋజువుచేసిన వ్యక్తిని ఇక నేనెలా పెంబడించగలను? ఎంతో విశాలహృదయు డనుకొన్న నరేందర్ నా దగ్గిర ఎన్ని విషయాలు దాచాడు? అదే నా బాధ... తీరని బాధ!

శోభకు సహాయం చేస్తానన్నాను. పాపం, పిచ్చిపిల్ల. ప్రపంచమంటే ఇంకా అర్థం చేసుకోలేదు. 'మామయ్య కావాలి.' అంతే ఆమె ఆశ. నరేందర్‌ను ఆఖరిసారిగా కలుసుకోవాలి.

నాలుగు గంటలకు అన్నట్లుగానే తాజ్ దగ్గిర చిరునవ్వుతో పలకరించాడు నరేందర్. హోటల్ లోనికి వెళ్లి కూర్చున్నాము.

"సుమా! మన సంగతి విన్ననే అమ్మతో చెప్పేద్దామనుకొన్నానుగాని బండినుండి దిగగానే పెళ్లి సంగతులెత్తితే ఏం బాగుంటుందని ఊరుకొన్నాను. అందుకని ఈ రాత్రికి వాయిదా వేశాను."

నేను సిగ్గుపడతాననుకున్నాడు కాబోలు క్రీగంట నావైపు చూశాడు.

"మీ శోభ సంగతులు ఏమిటి?" నిర్వికారంగా, అర్థయుతంగా ప్రశ్నించాను.

గతుక్కుమన్నాడు. కాని త్వరలో సర్దుకుని చిరునవ్వును, చికాకును మిళాయించి, "ఇప్పుడు దాని సంగతి ఎందుకు మధ్య?" అన్నాడు.

"కాదు, నరేందర్. నీవు నాకీ విషయాలు ముందు ఎందుకు చెప్పలేదు? చెప్తేఉంటే నీమీద గౌరవం తగ్గిపోతుందని భయపడ్డావా?" బాధగా అన్నాను.

"సుమా! ఏమిటి నీవనేది? శోభగాని నీతో ఏమయినా చెప్పిందా?"

'ఊఁ' అన్నట్లు తల ఊపాను.

ఈసారి నరేందర్ చాల హుందాగా నిబ్బరంగా ఇలా అన్నాడు: "సుమతీ, నీవు నన్నేదో మోసగాడికింద జమకడుతున్నా వనుకుంటాను. నిజమే. చిన్నప్పటి నుండి శోభను నాకివ్వాలనే అనుకొంటున్నారు. కాని నా అభిరుచులకు తగిన స్త్రీ దొరికినపుడే వివాహం చేసుకోవాలని నేను కోరాను. నా నిరీక్షణకు ఫలితంగా నీవు దొరికినపుడు, నా మహాభాగ్యానికి ఆనందించాను. కాని మధ్యలో ఇలా అపార్థాలకు దారితీస్తుం దనుకోలేదు."

నాలో ఏ మార్పూ కలగలేదు.

"లేదు, నరేందర్. నీ అంచనాలన్నీ తప్పు. నీ అభిరుచులు, నా అభిరుచులు ఒకటి కావని కనీసం ఈ రోజు అర్థం చేసుకో. ఒక అమాయక ప్రాణిని — నిన్ను నిర్మలంగా ప్రేమిస్తున్న శోభను — నీవు అన్యాయం చేసి ఆనందించేది ఉండదు. కనీసం నా మాటలకు విలవ ఇద్దామనుకుంటే శోభను చేసుకో. ఇదే నేను నిన్ను ఆఖరిసారిగా కోరేది." మనస్సును అధీనంలో పెట్టుకొని అనగలిగాను ఈ మాటలు.

"నన్ను అర్థం చేసుకోవడంలేదు నీవు."

"చేసుకున్నాను, నరేందర్, పూర్తిగా చేసుకున్నాను. శోభకు అన్యాయం చేసి నీతో ఆనందంగా గడపలేను. ఇది నా బలహీనతే కావచ్చు. కాని, నీవు ఆమెలో అన్ని సంవత్సరాలుగా నింపిన ఆశలన్నీ శూన్యం చేస్తే ఎలా ఉంటుందో ఆలోచించావా? ప్రమాణం చేయి నరేందర్, శోభను చేసుకుంటావని."

నరేందర్ నా దృఢనిశ్చయాన్ని అర్థం చేసుకొన్నాడు. వాగ్దానం చేశాడు. ఆరునెలలు తిరిగేలోపున శుభలేఖ వచ్చింది. పెళ్లికి వెళ్లాను. నరేందర్, శోభలకు శుభం కలగాలని మనసారా కోరుకున్నాను. పెళ్లి పందిరినుండి బయటికి వచ్చాను. ఇంతకాలంగా అణచి పెట్టుకున్న అగ్నిపర్వతాలు బద్దలయ్యాయి. 'భగవాన్, నా ఆశలన్నీ అంతరించిపోయాయి కదా, తిరిగి నేనింకో మనిషిని ప్రేమించలేను. మనశ్శాంతి లేదు. ఎలా?'

అందుకనే అక్కడనుండి తిన్నగా బార్‌కి బయలుదేరాను.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాను. ఇప్పుడు ఉన్నది బార్ లోనా? ఎదురుగా చూశాను. బల్లమీద గ్లాసు, దాని నిండా ఎర్రని ద్రవం అలానే ఉన్నాయి. మెదడు ఆలోచనలతో అలిసిపోయింది. ఇక ఆలోచించవలసింది ఏమీ లేదు.

మెల్లిగా చేతులు చాచి గ్లాసు అందుకొని పెదవుల కానించాను. ★

దేవుని కథల శిల్పాలు

ఫోటో—దిలీప్‌కుమార్ పెంటు (హైదరాబాదు)

